మురుగు రహిత కుప్పం!

- ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో యూజీడీ సర్వే పూర్తి
- నెలాఖరుకల్లా అంచనాల తయారీకి కసరత్తు
- ఇప్పటికే మంజూరైన రూ.110 కోట్ల నిధులు



గుడుపల్లె మండలం బందార్లపల్లెలో సర్వే చేస్తున్న సిబ్బంది



యూజీడీ అమలుతో పరిశుభ్రంగా ఉన్న రామకుప్పంలోని వైశ్య వీధి

కుప్పం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మురుగు రహిత గ్రామీణం దిశగా కుప్పం అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం గ్రామీణ నీటి సరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యుఎస్) ఆధ్వర్యంలో నియోజకవర్గవ్యాప్తంగా జరిగిన సర్వే సంక్రాంతి పండుగకు ముందు పూర్తయింది.ఈ నెలాఖరుకల్లా అంచనాలను తయారు చేయడానికి అధికార యంత్రాంగం సిద్ధమైంది. కుప్పం నియోజకవర్గంలో 451 మురుగునీటి కాలువల నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వం రూ.110.21 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. వైసీపీ అయిదేళ్ల పాలనలో తీవ్ర వివక్షకు గురైన కుప్పం నియోజకవర్గం ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికార పీఠం అధిష్ఠించిన నాటినుంచి వందల కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మరికొన్ని కోట్ల రూపాయల నిధులు జరగబోయే అభివృద్ధి పనులకోసం మంజూరయ్యాయి. నియోజకవర్గంలో మురుగు కాలువల నిర్మాణానికి అలా విడుదలైనవి ఏకంగా రూ.110.21 కోట్లు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 6, 7 తేదీల్లో కుప్పంలో పర్యటించినప్పుడు ఈ పనులకు లాంఛనంగా శంకుస్థాపన చేశారు. ఇప్పుడు ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో నిర్మించబోయే మురుగు కాలువలకోసం అవసరమైన కసరత్తు జరుగుతోంది. నాలుగు మండలాలలో కలిసి మొత్తం 451 మురుగు కాలువల పనులను ఈ నిధులతో చేపట్టనున్నారు.

● యూజీడీపై అపోహలు తొలగించాలి

కుప్పం నియోజకవర్గాన్ని మురుగు రహితంగా మార్చడానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం (యూజీడీ) కోసం అవసరమైన సర్వే ఇప్పటికే పూర్తయింది. అయితే ఈ భూగర్భ మురుగు కాలువల పథకంపైన కొందరిలో ఇప్పటికీ అనుమానాలు ఉన్నాయి. 2014-2019లో టీడీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో మండల కేంద్రమైన రామకుప్పంలో రాష్ట్రంలోనే తొలిసారిగా గ్రామీణ ప్రాంతాలలో భూగర్భ మురుగు కాలువలను నిర్మించారు. 2017లో రామకుప్పం మొత్తాన్ని యూజీడీ కిందికి తీసుకువచ్చారు. అప్పట్లో ఈ పథకం ఫెయిలైందని ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు చూస్తే ఎక్కడా మురుగనేదే లేకుండా అంతా భూగర్భం కింద నిర్మించిన కాలువల్లో పారుతున్న మురుగునీరు ఊరికి శివారులోని రెండు చెరువుల సమీపంలో ఏర్పాటు చేసిన పెద్ద ఇంకుడు గుంతల్లోకి చేరుతోంది.అలాగే గుడుపల్లె మండలంలోని సొన్నార్లన పల్లె, గుడికొత్తూరు, సోడిగానిపల్లె గ్రామాలలో ఒకట్రెండు వీధుల్లో యూజీడీ పద్ధతిలో మురుగుకాలువల నిర్మాణం సాగింది. ఆయా ప్రాంతాలు ఇప్పుడు పరిశుభ్రంగా ఉన్నాయి. అలాగే గుడుపల్లె రైల్వే స్టేషన్ ఉన్న కాడేపల్లె ప్రాంతంలో కూడా భూగర్భంలోనే మురుగు కాలువలు నిర్మించి సక్సెస్ అయ్యారు. రామకుప్పంలో అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో ఆ శాఖ ఆధ్వర్యంలోనే యూజీడీ అమలయింది. అయితే ఇప్పుడు అసలు శాఖ అయిన గ్రామీణ నీటిపారుదల శాఖకే యూజీడీ బాధ్యతను అప్పగించారు. భూగర్భ మురుగుకాలువల పథకంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించి, శాస్త్రీయంగా సాంకేతిక పద్ధతుల్లో యూజీడీని అమలు చేయాల్సిన బాధ్యత ఇక ఆ శాఖ అధికారులదే. ప్రభుత్వానికి మురుగుకాలువల ప్రతిపాదనలు పంపే సమయంలో యూజీడీ అనేది అనుకోలేదు. నిధులు మంజూరయ్యాక, ఇప్పుడు యూజీడీని అధికార యంత్రాంగం తెరమీదకు తీసుకువచ్చింది. డిసెంబరు నెలనుంచి డ్రోన్ సర్వేతోపాటు, మాన్యువల్ సర్వే అధికారులు జరిపించారు. రోడ్ల లెవెల్స్ తీయడంతోపాటు గ్రామాలలో భూగర్భంలో మురుగు కాలువల నిర్మాణానికి అనువైన పరిస్థితులను గమనించారు. సంక్రాంతి పండుగకు ముందు ఈ సర్వే పూర్తయింది. ఇప్పుడు అధికారులు అంచనాల తయారీలో పడ్డారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ పురుషోత్తం ఆధ్వర్యంలో నాలుగు మండలాలోనూ ఏఈలు, ఇతర సిబ్బంది ప్రస్తుతం ఈ పనిలోనే ఉన్నారు.జనవరి నెలాఖరుకల్లా అంచనాలు తయారవుతాయని అధికారులు భావిస్తున్నారు. అంచనాలు తయారయ్యాక, ఉన్నతాధికారులు, నిపుణులు వచ్చి యూజీడీ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోనున్నారు. మరోవైపు స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ శ్రేణుల సహకారం కూడా భూగర్భ మురుగు కాలువల పథకానికి అవసరం. అంతేకాక, ప్రజలను విశ్వాసంలోకి తీసుకుని వారినుంచి ఆమోదం పొందాల్సిన అవసరం ఉంది. ఈ దశలన్నింటినీ పూర్తి చేసుకున్నాక, యూజీడీ అమలుకు శ్రీకారం చుట్టనున్నారు.

● రోడ్లను పగులగొట్టాల్సిందేనా?

భూగర్భ మురుగు కాలువల పథకం అమలు చేయాలంటే ముందుగా వీధుల్లో పైపులైన్లను పూడ్చడానికి గాడి తవ్వాలి. గతంలో ఉన్న సిమెంటు రోడ్లతోపాటు గ్రామాలలో కొత్తగా రూ.20.91 కోట్లతో మంజూరైన సిమెంటు రోడ్లను అదనంగా నిర్మిస్తున్నారు. వీటి నిర్మాణం కూడా దాదాపు పూర్తయింది. ఇప్పుడు భూగర్భంలో పైపులైన్లు నిర్మించడానికి ఈ సిమెంటు రోడ్లను పగులగొట్టడం అవసరం. పగులగొట్టాక తిరిగి వాటిని పూడ్చి కాంక్రీటు కూడా వేయాల్సి ఉంటుంది. దీనివల్ల అంచనా వ్యయం పెరగడమేకాక, రోడ్లు పాడవుతాయి. ఇలా కాకుండా సిమెంటు రోడ్లకు ఒకవైపున లేదా రెండు వైపులా ఖాళీగా ఉన్న ప్రాంతాలలో గాడి తవ్వి, అక్కడ పైపులైన్లు వేస్తే ఎలా ఉంటుందని అధికారులు ఆలోచిస్తున్నారు. గ్రామాలలో చాలాచోట్ల కేవలం 10 అడుగుల మేర మాత్రమే సిమెంటు రోడ్లు నిర్మాణమయ్యాయి. ఇటూఅటూ వీధుల్లో ఖాళీ ప్రదేశం మిగిలిపోయింది. ఈ ఖాళీ ప్రదేశాలు భూగర్భ మురుగునీటి పైపులైన్లు నిర్మించడానికి అనువుగా ఉంటాయని భావిస్తున్నారు. ఏదిఏమైనా యూజీడీ పథకం సక్సెస్ అయితే కుప్పం నియోజకవర్గం మురుగురహితంగా మారి, ప్రజలు ఎదుర్కొంటున్న పారిశుద్ధ్య సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుంది.



ధ్వంసమైన పూరిగుడిసెను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్ తదితరులు

ఒంటరి ఏనుగు హల్‌చల్

- కోటపల్లి వద్ద పూరిగుడిసె ధ్వంసం

కల్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో మళ్లీ ఏనుగుల బెడద మొదలైంది. 50 రోజుల విరామం అనంతరం మండలంలోకి ఒంటరి ఏనుగు ప్రవేశించింది. ఇటీవల సోమల మండలంలో పంటలను ధ్వంసం చేస్తున్న ఓ ఏనుగు రెండు రోజుల క్రితం పాళెం పంచాయతీ సరిహద్దులో ఉన్న చింతలవంక అటవీప్రాంతానికి చేరుకొని తిష్ట వేసింది. బుధవారం వేకువజామున అడవి నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు పాళెం పంచాయతీ కోటపల్లెలోని రైతు కరణం హంసవేణి మామిడితోటలోకి ప్రవేశించింది.10 మామిడిచెట్లతో పాటు కొబ్బరి, పనస చెట్లను విరిచేసింది. అనంతరం తోటలోని పూరిగుడిసెను ధ్వంసం చేసి లోపలున్న బట్టలు, బియ్యం, నిత్యావసర వస్తువులను చెల్లా చెదరు చేసింది.ఏనుగుల భయంతో పూరిగుడిసెలో కాపురముంటున్న కాపరి కృష్ణయ్య కుటుంబం అక్కడ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఇదే గ్రామంలోని రైతు వెంకటరమణకు చెందిన 5 మామిడి చెట్లు, రైతు రఘుకు చెందిన రెండు మామిడిచెట్లను ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది. ఈ విషయాన్ని బాధిత రైతులు అటవీశాఖ అధికారులకు తెలపడంతో ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్, ఎఫ్ఎస్వో మహ్మద్ షఫీ, డీఆర్వో ఆనందరెడ్డి పంటలను ధ్వంసం చేసిన ప్రాంతానికి చేరుకున్నారు. డ్రోన్ సాయంతో ఏనుగు జాడను గుర్తించేందుకు ప్రయత్నించారు కానీ చీకటి పడడంతో వీలుకాలేదు. ఏనుగు అడవివైపు వెళ్లినట్లు పాదముద్రల ఆధారంగా రైతులు తెలిపారు.

- టీటీడీ టోకెన్ల జారీలో చోటుచేసుకున్న తొక్కిసలాటపై న్యాయ విచారణ
- మంచి నిర్ణయమంటున్న జనం



లోపాలేమిటి.. బాధ్యులెవరు?

తిరుపతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి బైరాగి పట్టెడలోని పద్మావతీ పార్కులో తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించిన అంశం ఉద్యోగవర్గాల్లో గుబులు రేపుతుండగా, సాధారణ జనంలో మాత్రం ప్రభుత్వ స్పందన పట్ల సానుకూలత వ్యక్తమవుతోంది. వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ కేంద్రంలో ఈనెల 8న జరిగిన సంఘటన ఆరుగురి మృతికి దారితీసిన విషయం సంచలనంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణం స్పందించారు. మరుసటి రోజు స్వయంగా తిరుపతి వచ్చారు. తొక్కిసలాట జరిగిన బైరాగిపట్టెడలోని పద్మావతీ పార్కును సందర్శించారు. భద్రతా వైఫల్యంపై కలెక్టర్, ఎస్పీ, టీటీడీ ఈవోలపై ఆగ్రహం వ్యక్తం చేసి మందలించారు. టీటీడీ చరిత్రలోనే తొలిసారిగా పరిపాలనా భవనానికి సీఎం స్వయంగా వచ్చి కలెక్టర్, ఎస్పీ, టీటీడీ అధికారులు, పాలకమండలి ఛైర్మన్‌లతో సమీక్షించారు. ఆ వెంటనే ప్రాథమిక చర్యల్లో భాగంగా తొక్కిసలాట జరిగిన కేంద్రం వద్ద డ్యూటీలో వున్న క్రైమ్ డీఎస్పీ రమణకుమార్, టీటీడీ గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డిలను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వైఫల్యాలకు బాధ్యులుగా భావించి ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, జేఈవో గౌతమిలను బదిలీ చేస్తున్నట్టు ప్రకటించారు. జరిగిన ఘటనపై న్యాయ విచారణ చేయిస్తామని ఆ రోజే వెల్లడించారు. అందులో భాగంగా హైకోర్టు రిటైర్డు జడ్జి ఎం.సత్యనారాయణ మూర్తిని విచారణాధికారిగా నియమిస్తూ బుధవారం అసాధారణ గెజిట్ నోటిఫికేషన్ జారీ అయింది. విచారణకు ఆరు నెలల గడువు విధించారు.

న్యాయవిచారణ ఇలా..

- తొక్కిసలాటకు దారితీసిన పరిస్థితులు ఏమిటని గుర్తించడం
- ఘటన జరిగిన కేంద్రంలో ఏర్పాట్లు తగినవిధంగా వున్నాయా? లోపాలుంటే అందుకు బాధ్యులు ఎవరు అని గుర్తించడం.
- భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయడం.
- తిరుమల,తిరుపతిల్లో భక్తుల భద్రతకు వ్యవస్థాగతంగా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయడం.

శభాష్ సీఎం!

తొక్కిసలాట ఘటనకు పోలీసు, రెవిన్యూ, టీటీడీ, మున్సిపల్ యంత్రాంగాలలో ఎవరెవరు ఏయే స్థాయిల్లో బాధ్యులో న్యాయవిచారణలో తేలనుంది. ఘటన జరిగిన 15 రోజుల వ్యవధిలోనే రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించి న్యాయ విచారణకు ఆదేశించడం పట్ల సామాన్య జనంలో సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. తొక్కిసలాట ఘటన జరిగిన రోజు, మరుసటి రోజు సీఎం స్పందించిన తీరు.. ప్రత్యర్థులను కూడా నోరు తెరవకుండా చేసింది. తనకు సన్నిహితులుగా ముద్ర పడిన అధికారులపై కూడా ఆయన మొహమాటాలకు పోకుండా చర్యలు తీసుకోవడంతో ఆయన ఈ సంఘటనను ఎంత సీరియస్‌గా తీసుకున్నారో అర్థం అవుతోంది. మృతుల కుటుంబాలకు పరిహారాలు, టీటీడీలో ఉద్యోగాలు వంటి నిర్ణయాలు తీసుకున్న తర్వాత కూడా ఈ ఘటనను నీరుగార్చే ప్రయత్నం చేయకుండా సీఎం అదే తీవ్రత కొనసాగించడం చర్చగా మారింది.

అధికారుల్లో గుబులు

న్యాయ విచారణకు ఆదేశిస్తూ బుధవారం నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో తిరుపతి పోలీసు, రెవిన్యూ, టీటీడీ అధికార వర్గాల్లో గుబులు మొదలైంది. టోకెన్ల జారీ కేంద్రాల నిర్వహణకు సంబంధించి జిల్లా రెవిన్యూ, పోలీసు, టీటీడీ యంత్రాంగాల్లో ఉన్నతాధికారుల నుంచీ కిందిస్థాయి ఉద్యోగుల వరకూ పలువురి ప్రమేయం తప్పనిసరి. ఎవరి పరిధిలో వారు తమ విధులను బాధ్యతతో నెరవేర్చాల్సి వుంటుంది.. సాధారణ శాఖపరమైన విచారణలు అయితే అధికారులు, ఉద్యోగులు పెద్దగా ఆందోళన చెందే పరిస్థితి లేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా హైకోర్టు రిటైర్డు జడ్జితో న్యాయ విచారణకు నిర్ణయం తీసుకోవడంతో బైరాగిపట్టెడలోని టోకెన్ల జారీ కేంద్రం వద్ద విధులకు సంబంధించి ప్రమేయమున్న అధికారులు, ఉద్యోగులు ఆందోళనకు లోనవుతున్నారు. న్యాయ విచారణ ముగిసి నివేదికలో వైఫల్యాలకు ఎవరు బాధ్యులవుతారో అని చర్చించుకుంటున్నారు.

వీరజవాన్‌కు కన్నీటి వీడ్కోలు



- హాజరైన పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు
- అన్నివిధాలా ఆదుకుంటామని హామీ
- అండగా ఉంటామని కలెక్టర్ భరోసా
- పరిసర గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన యువకులు, విద్యార్థులు



కార్తీక్ మృతదేహంపై జాతీయ జెండాను కప్పి అంత్యక్రియలకు తరలిస్తున్న సైనికులు - కార్తీక్ తల్లి సెల్వికి కలెక్టర్ పాదాభివందనం

బంగారుపాళ్యం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జమ్మూ, కశ్మీర్‌లో ఉగ్రవాదులు, సైనికుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో వీరమరణం పొందిన యువ జవాన్ కార్తీక్ అంత్యక్రియలు తన స్వగ్రామమైన ఎగువ రాగిమానుపెంటలో అధికారలాంఛనాలతో బుధవారం సాయంత్రం 3.45 గంటలకు పూర్తయ్యాయి. బెంగళూరు నుంచి రోడ్డు మార్గం ద్వారా ఆర్మీ వాహనాల్లో కార్తీక్ భౌతికకాయాన్ని బుధవారం ఉదయం 6 గంటలకు గ్రామానికి ఆర్మీ అధికారులు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అతడి స్నేహితులు, గ్రామస్తులు బంగారుపాళ్యం నుంచి ఎగువ రాగిమానుపెంట గ్రామం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్తీక్ భౌతికకాయాన్ని చూడగానే తల్లిదండ్రులు సెల్వి, వరదరాజులు, అన్న రాజేష్‌తో పాటు బంధుమిత్రులు భోరున విలపించారు. గ్రామస్తులు వారిని ఓదార్చే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. వీరజవాన్ కార్తీక్‌ను చివరి చూపు చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున యువత, విద్యార్థులు తరలివచ్చారు. ఉదయం 11 గంటలకు ఎగువ రాగిమానుపెంటకు చేరుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు మురళీమోహన్, గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత తదితరులు కార్తీక్ భౌతిక కాయానికి ఘన నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ కార్తీక్ దేశం కోసం చేసిన త్యాగం యువతకు ఆదర్శమని తెలిపారు. అమరజవాన్ మరణం అతడి కుటుంబానికి తీరని లోటన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశీ పర్యటనలో ఉన్నారని, కార్తీక్ మరణ వార్త తెలిసిన వెంటనే ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం తరపున వారి కుటుంబానికి సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.ఎగువ రాగిమానుపెంటలో కార్తీక్ నివాసం ఉంటున్న కాలనీకి కార్తీక్ పేరు పెట్టేలా ప్రతిపాదించామన్నారు. ఆయన చదువుకున్న పాఠశాలలో విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పారు. కుటుంబంలో ఒకరికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని తెలిపారు. అలాగే తల్లిదండ్రుల పేరిట ఐదు ఎకరాల వ్యవసాయ భూమితో పాటు ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్తీక్ కుటుంబానికి ప్రభుత్వం తరపున అండగా నిలిచి పూర్తి సహకారం అందించడానికి ముఖ్యమంత్రి కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ జీజేఎం ట్రస్టు ద్వారా రూ.50వేల చెక్కును కార్తీక్ తండ్రి వరదరాజులుకు అందజేశారు. కాగా కార్తీక్‌కు సంబంధించిన వస్తువులను, రికార్డులను అతడి తల్లిదండ్రులకు ఆర్మీ అధికారులు అప్పగించారు.





ఎమ్మెల్యేలు జగన్, మురళి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు నివాళులు - అంత్యక్రియలకు హాజరైన జనం

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

గూర్ఖా రైఫిల్స్ బెటాలియన్ లెఫ్టినెంట్ శివరాజ్‌సింగ్ గిల్ ఆధ్వర్యంలో వీరజవాన్ కార్తీక్ భౌతికకాయంపై జాతీయ జెండాను కప్పి గౌరవ వందనం చేశారు. అనంతరం ఆయన భౌతిక కాయాన్ని ఆర్మీ వాహనంలో ర్యాలీగా గ్రామవీధుల మీదుగా తీసుకెళ్లి వారి మామిడి తోటలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మీ జవాన్లు గాలిలోకి మూడు సార్లు కాల్పులు జరిపి అంత్యక్రియలు పూర్తి చేశారు. నివాళులర్పించిన వారిలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ కుమారరాజా, ఎన్‌పీ ధరణి, సర్పంచ్ హరి, ఆర్డీవో భవాని, తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి కేవీ రాఘవులు, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ గంటా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలులో పలమనేరు ఫస్ట్

పలమనేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):ఆస్తి పన్నుల వసూలులో పలమనేరు మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలిచిందని కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి తెలిపారు.అరియర్స్, డిమాండు మొత్తం రూ.2.97 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.2.47 కోట్లు (83.28 శాతం) వసూలు చేసినట్లు చెప్పారు. పుంగనూరు మున్సిపాలిటీలో రూ.4.84 కోట్లకు గాను రూ.3.32 కోట్లు (68.57 శాతం), నగరిలో రూ.3.43 కోట్లకు గాను రూ.1.98 కోట్లు (57.82 శాతం), చిత్తూరులో రూ. 22.70 కోట్లకు గాను రూ. 12.76 కోట్లు (56.23 శాతం), కుప్పంలో రూ.4.91 కోట్లకు గాను రూ. 2 కోట్లు మాత్రమే ఇప్పటివరకు వసూలయ్యాయి. ఇక నీటి పన్ను విషయంలోనూ పలమనేరు ప్రథమ స్థానంలో నిలిచింది.నీటిపన్ను మొత్తం డిమాండు రూ.152.14 లక్షలకు గాను ఇప్పటివరకు రూ.72.14 లక్షలు (56.90 శాతం) వసూలైందన్నారు.



శ్రీవారి సేవలో మేలుకోట్ మఠాధిపతి

మేలుకోట్ మఠాధిపతి యదుగిరి యతిరాజ స్వామి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయ మహద్వారం వద్దకు చేరుకున్న స్వామికి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చకబృందం ఇస్తికఫాల్(ఆలయ మర్యాదలు)తో స్వాగతం పలికారు. అలాగే బిగ్‌బాస్ ఫేం నటి అశ్వినిశ్రీ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆలయం ముందు యతిరాజ స్వామిజీ - అశ్వినిశ్రీ

చిత్రకూట్‌లో వైభవంగా శ్రీనివాసకల్యాణం

తిరుమల, జనవరి22(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళా సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్ నగరంలో ఉత్తరాది అహోబిలం మఠంలో బుధవారం ఉదయం శ్రీనివాస కల్యాణాన్ని టీటీడీ అంగరంగ వైభవంగా నిర్వహించింది. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో అర్చక బృందం ఉదయం 11 నుంచి 12 గంటల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1008 రాజ్ గురు పీఠాధీశ్వర్ స్వామి బద్రి ప్రసన్నాచార్యజీ మహారాజ్, టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ గుణభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న అధ్యయనోత్సవాలు

తిరుమల, జనవరి22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 30న ప్రారంభమైన అధ్యయనోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. 25 రోజుల్లో ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4 వేల పాశురాలను శ్రీవైష్ణవులు స్వామివారి ఆలయంలోని రంగనాయక మండపంలో పారాయణం చేశారు. నేడు తణ్ణీరముదు ఉత్సవంతో అధ్యయనోత్సవాలు ముగుస్తాయి.


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 23 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.4.04 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,581

తలనీలాలు సమర్పించినవారు: 19,228



మల్లిమడుగులో మళ్లీ మట్టి తవ్వకాలు

- మైనింగ్ శాఖ పేరుతో చెక్‌పోస్టు
- చోద్యం చూస్తున్న అధికారులు



మల్లిమడుగు రిజర్వాయరు పరిసరాల్లో ఎక్స్‌కవేటర్‌తో టిప్పర్‌లో నింపుతున్న మట్టి

రేణిగుంట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మల్లిమడుగు రిజర్వాయరులో మళ్లీ అక్రమ మట్టి తవ్వకాలు మొదలయ్యాయి. ఏకంగా మైనింగ్ శాఖ సిబ్బంది అంటూ అనధికారికంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేసి రాత్రీపగలు టన్నుల కొద్దీ మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కానీ, రెవెన్యూ అధికారులు కానీ ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి నెల నుంచి ఇక్కడినుంచి పలక మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఆంధ్రజ్యోతి దినపత్రికలో వరుస కథనాలు వెలువడ్డాయి. స్పందించిన తహసీల్దారు సురేష్‌బాబు మూడు నెలల క్రితం ఈ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. టిప్పర్లు, లారీలు వెళ్లకుండా ప్రత్యేకంగా మూడు చోట్ల కందకాలను తవ్వించి మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశారు. అయితే గడిచిన నెల రోజులుగా రాత్రి సమయంలో మాత్రం గుట్టుచప్పుడు కాకుండా టిప్పర్లలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఇటీవల పది రోజులుగా రేణిగుంట, కడప ప్రధాన రహదారిలోని ఆంజనేయపురం చెక్‌పోస్టు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద మల్లిమడుగు రిజర్వాయరులోకి వెళ్లే మట్టిరోడ్డు వద్ద ప్రత్యేక చెక్‌పోస్టును తలపించేలా ఇనుప రేకులతో రూమును ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో యువకులను ఉంచారు. వీరు రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు. మల్లిమడుగు రిజర్వాయరు నుంచి వెళ్లే లారీ నెంబర్లను బిల్లులను రిజిస్టర్‌లో నమోదు చేస్తూ ఉంటారు. ఈ యువకులను ప్రశ్నించగా తాము మైనింగ్ శాఖకు సంబంధించిన వాళ్లమని కడప వైపు నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తామని చెప్పుకొచ్చారు. అయితే మల్లిమడుగు రిజర్వాయరులో మట్టి తరలింపునకు అనధికారికంగా వేలం నిర్వహిస్తే తిరుపతికి చెందిన కొంతమంది అధిక మొత్తంలో పాడుకున్నట్టు తెలుస్తోంది. ఇక్కడి మట్టిని తిరుపతి, చంద్రగిరి, పాకాల, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, పుత్తూరు, నగరి ప్రాంతాలకు ప్రతి రోజు తరలిస్తున్నారు. ఈ లారీలు ఇప్పటి వరకు నిత్యం ఈ రహదారిలో విధులు నిర్వహించే బ్రేక్ ఇన్‌స్పెక్టర్, పోలీసులకు కనపడకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పటికైనా మట్టి, ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు మైనింగ్ శాఖ అధికారులు, మండల పోలీసులు, రెవెన్యూ, మండల అధికారులను సమన్వయం చేసుకుని ముందుకు వెళితే కొంతైనా ఈ అక్రమ రవాణాన్ని కట్టడి చేసే అవకాశం ఉంటుంది. ఈ విషయమై జిల్లా మైనింగ్ శాఖ అధికారి బాలాజీని వివరణ కోరగా మల్లిమడుగు రిజర్వాయర్ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు ఎవరికీ ఇవ్వలేదని స్పష్టం చేశారు.



చెక్‌పోస్టు వద్ద మైనింగ్ శాఖ సిబ్బందిగా చెబుతున్న యువకుల ఫొటోలు తీస్తుండగా జారుకుంటున్న దృశ్యం



మట్టి అక్రమ తరలింపునకు ముద్రించిన బిల్లు





కమ్మలు తీసిస్తూ.. - మెడలో గొలుసు తీసిస్తున్న విద్యార్థిని

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

- తొలిరోజు 89మంది విద్యార్థులు గైర్హాజరు

తిరుపతిరూరల్, జనవరి22(ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలలో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలివిడత జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9-12గంటలు, మధ్యాహ్నం 3-6గంటల వరకు జరిగిన ఈ పరీక్షలకు తొలిరోజు 2326మంది విద్యార్థులకుగాను 2237 మంది హాజరై పరీక్ష రాశారని సిటీకోఆర్డినేటర్ టికైలాష్‌నాథ్ పేర్కొన్నారు. 89మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదన్నారు. ఎన్‌టీఏ నిబంధనల ప్రకారం విద్యార్థులను క్షుణంగా తనిఖీ చేసి కేంద్రాలోకి అనుమతించారు. చెవిలో కమ్మలు, మెడలో గొలుసులు, కాళ్ల వద్ద డ్రెస్‌కు దారాలుంటూ వీటినీ తీసేయించారు. నిర్ణీత సమయానికి కేంద్రాల వద్ద ప్రధాన గేటును మూసివేశారు. జిల్లాలో తిరుపతిరూరల్‌మండలం జూపార్క్‌రోడ్డు (చెర్లోపల్లె)లోని అయాన్‌డిజిటల్, చంద్రగిరిమండలంలో రామిరెడ్డిపల్లెలోని కేఎంఎం, కోటమండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల కేంద్రాలను కేటాయించారు. కాగా చెర్లోపల్లెలోని అయాన్‌డిజిటల్ కేంద్రం వద్ద ఉదయం 7గంటల నుంచి విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సందడి నెలకొంది. విద్యార్థులు దాదాపుగా సకాలంలో కేంద్రాలకు చేరుకోవడం జరిగింది. ఆలస్యంగా వచ్చి వెనుతిరిగిన సంఘటనలు చోటుచేసుకోలేదు. సహాయకులుగా వచ్చిన వారు విద్యార్థులకు ఆల్‌దిబెస్ట్ చెబుతూ కనిపించారు. కాగా తొలి రోజు నిర్వహించిన పరీక్షలో ప్రశ్నాపత్రం ఈజీగా ఉందని కొందరు విద్యార్థులు అంటుండగా.. మరికొందరు గణితం, ఫిజిక్స్ సబ్జెక్టుల ప్రశ్నలు కొంత కఠినంగా, కెమిస్ట్రీ ప్రశ్నలు కొంత ఈజీగా ఉన్నాయని చర్చించుకుంటూ కనిపించారు.



తిరుపతి నగరం జూపార్కు రోడ్డులోని అయాన్ డిజిటల్ కేంద్రంలో విద్యార్థులు

జిల్లాకు 79 కొత్త ఆర్టీసీ బస్సులు



తిరుపతి(ఆర్టీసీ), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని 10 డిపోలకు 79 నూతన ఆర్టీసీ బస్సులు వచ్చాయి. ఇందులో ఆర్టీసీ సొంత బస్సులు 50, అద్దె బస్సులు 29 ఉన్నాయి. ఇప్పటికే కొన్ని బస్సులు వివిధ రూట్లలో తిరుగుతుండగా కొన్ని మాత్రం రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్నాయి. అవి కూడా ఈ వారంలో రోడ్డెక్కుతాయని డీపీటీవో నరసింహులు తెలిపారు.

సొంత బస్సులు: అల్ట్రా డీలెక్స్- తిరుపతి డిపోకు 2, సూపర్‌లగ్జరీ- తిరుపతి 7, వెంకటగిరి 6, శ్రీకాళహస్తి 3, మంగళం, సత్యవేడు ఒక్కొక్కటి, ఎక్స్‌ప్రెస్‌లు-వాకాడు 12, గూడూరు, వెంకటగిరి 9చొప్పున.

అద్దె బస్సులు: సూపర్‌లగ్జరీ-తిరుపతి 2, ఎక్స్‌ప్రెస్‌లు-తిరుపతి 3, వెంకటగిరి 10, గూడూరు 1, వాకాడు 4. పల్లెవెలుగు-శ్రీకాళహస్తి 1, సత్యవేడు 3, వెంకటగిరి 2, గూడూరు 3.

ఉపసర్పంచి కుటుంబానికి పరిహారం అందజేత



చంద్రగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో ఇటీవల మృతి చెందిన కందులవారిపల్లె పంచాయతీ ఉప సర్పంచ్ రాకేష్‌చౌదరి కుటుంబానికి అటవీశాఖ నష్టపరిహారం ప్రకటించింది. పరిహారం కింద రూ.10 లక్షల చెక్కును ఆ శాఖ అధికారులు బుధవారం బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి,ఎఫ్ఆర్వో అనిత, ఎఫ్‌బీవో చిత్ర, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా తదితరులు పాల్గొన్నారు.

హలో.. మేము సీబీఐ

- మనీ లాండరింగ్ కేసులో అరెస్టు చేస్తామంటూ వృద్ధురాలికి బెదిరింపు
- రూ.2.5 కోట్లు లాగేసుకున్న సైబర్ నేరగాళ్లు
- కేసు పెట్టిన పది రోజుల్లోనే నిందితుడి అరెస్టు
- రూ.24.5 లక్షల రికవరీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): 'హలో.. మేము సీబీఐ' అంటూ డిజిటల్ అరెస్టుల పేరిట సైబర్ నేరగాళ్లు బెదిరిస్తున్నారు. మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారంటూ.. తిరుపతిలో ఓ 65 ఏళ్ల మహిళను భయపెట్టారు. ఆమె నుంచి రూ.2.5 కోట్లు లాగేశారు. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన వెస్ట్ పోలీసులు రాజమహేంద్రవరానికి చెందిన కీలక నిందితుడిని అరెస్టు చేశారు. ఈ వివరాలను బుధవారం సాయంత్రం ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ చందోలు మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. రాజమహేంద్రవరానికి చెందిన పాలకొల్లు అరుణ్‌వినయ్‌కుమార్ ఎంటీఏ చదివాడు. ఈజీ మనీ కోసం దారులు వెదికాడు. వాట్సాప్ కాల్స్ ద్వారా అమాయకులను బెదిరించి వివిధ అకౌంట్లకు డబ్బులు వేసుకునేవాడు. ఇలా తిరుపతికి చెందిన 65 ఏళ్ల మహిళకు గతేడాది డిసెంబరులో వాట్సాప్ కాల్ వచ్చింది. తాను ఢిల్లీలో సీబీఐ అధికారినని చెప్పాడు. రూ.200 కోట్ల మనీలాండరింగ్ చేశావని, నీపై సీబీఐ కేసు నమోదైందని బెదిరించాడు. బ్యాంకు అకౌంట్ల నుంచి చట్ట వ్యతిరేకంగా వివిధ కార్యకలాపాలకు నగదు వాడుతున్నందున అరెస్టు చేస్తామని చెప్పాడు. ఇలా.. మరికొందరు సీబీఐ అంటూ ఆమెకు ఫోన్లు చేశారు. మీ అకౌంటులోని డబ్బులు తమకు పంపితే.. ఆ నగదు మనీలాండరింగ్‌లో ఉందా లేదా అనేది దర్యాప్తు చేస్తామని, లేకుంటే మీ ఖాతాలకు జమ చేస్తామన్నారు. ఆమెను మాయమాటలతో నమ్మించి దాదాపు రూ.2.5 కోట్లు వివిధ ఖాతాలకు జమచేసుకున్నారు. చివరకు తాను సైబర్ నేరగాళ్ల నుంచి మోసపోయానని గుర్తించిన బాధిత మహిళ ఈ నెల 13న వెస్ట్ సీఐ మురళీమోహన్‌కు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.



అంతర్జాతీయ సైబర్ నేరగాడు అరెస్టు చేసి నగదు, బంగారు నగలు స్వాధీనం చేసుకున్న తిరుపతి పోలీసులు

దర్యాప్తునకు ప్రత్యేక బృందాలు

ఈ కేసు దర్యాప్తునకు అదనపు ఎస్పీ వెంకట్రావు నేతృత్వంలో డీఎస్పీ వెంకటనారాయణ పర్యవేక్షణలో సీఐలు వినోద్ (సైబర్ క్రైం), మురళీమోహన్ (వెస్ట్), ప్రకాష్‌కుమార్ (క్రైం), ఎస్ఐలు, సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులు వాడిన సెల్ ఫోను నెంబరు, బాధితురాలికి వచ్చిన వాట్సాప్ కాల్ నెంబరు ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. రాజమహేంద్రవరం కేంద్రంగా ఇలా బెదిరించి ఆన్‌లైన్ ద్వారా నిందితులు డబ్బులు కాజేస్తున్నట్లు గుర్తించారు. ఈ కేసులో కీలక నిందితుడు అరుణ్ వినయ్‌కుమార్‌ను బుధవారం రాజమహేంద్రవరంలో అరెస్టు చేసి తిరుపతికి తీసుకొచ్చారు. ఎస్పీ ఆధ్వర్యంలో మీడియా ముందు హాజరుపరిచారు. ఇతడి నుంచి కొత్త కారు, బ్యాంకులోని రూ24.5 లక్షల నగదు, రెండు ల్యాప్‌టాప్‌లు, రెండు సెల్ ఫోన్లు, 16 గ్రాముల బంగారు నగలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఆరేడుగురు నిందితులున్నారని, వారికోసం గాలిస్తున్నారు. ఈ కేసులో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ అభినందించారు. వారికి రివార్డులు ప్రకటించారు.

నేడు సామూహిక సూర్య నమస్కారం

తిరుపతి(క్రీడలు), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్, వివేకానంద జయంతి ఉత్సవాల ముగింపు పరాక్రమ్ దివస్ సందర్భంగా శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ, వివేకానంద కేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10వేల మందితో సామూహిక సూర్య నమస్కారం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో 12నుంచి 50 సంవత్సరాల లోపు వారు పాల్గొనవచ్చు. అల్పాహారం, యోగా పుస్తకం, శ్రీవారి ప్రసాదాలు అందజేస్తారు.

స్విమ్స్‌లో అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు వాయిదా

తిరుపతి(వైద్యం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రతి ఆదివారమూ ఉచితంగా నిర్వహించే అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీన చేపట్టాల్సిన పరీక్షలను వాయిదా వేశామని, ఫిబ్రవరి 2 నుంచి యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

తిరుపతిలో తమిళనాడు భక్తుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం విరుధనగర్‌కు చెందిన జయకన్నన్ (45) బుధవారం తిరుపతిలోని ఓ లాడ్జిలో మృతిచెందారు. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు.. కొంతకాలంగా మూర్ఛతో బాధపడుతున్న జయకన్నన్, మంగళవాం శ్రీవారి దర్శనార్థం తిరుమల వచ్చారు. తిరుపతి ఈస్ట్ పరిధిలోని ఓ లాడ్జిలో గది తీసుకున్నారు. మద్యం తాగి పడుకున్న ఆయన ఎంతకీ బయటకు రాలేదు. సిబ్బంది తలుపులు తట్టినా స్పందించకపోవడంతో నిర్వాహకులు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ఉద్యోగం ఇప్పిస్తామని రూ.11 లక్షలు కాజేసారు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి తిరుపతి యాదవకాలనీకి చెందిన పి.హేమలత వద్ద ముగ్గురు దాదాపు రూ.11లక్షలు కాజేశారు. బాధితురాలు తెలిపిన ప్రకారం.. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న ఈమెను కొందరు కలిశారు. డబ్బులిస్తే ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. ఈ క్రమంలో గుంటూరుకు చెందిన లక్ష్మీనారాయణకు 6.57 లక్షలు, ననబోయిన వినీత్‌కుమార్‌కు రూ.2.15 లక్షలు, మారేడు నరేష్‌కుమార్‌కు రూ.2.40 లక్షలు పంపారు. ఎంతకూ ఉద్యోగం రాకపోవడంతో మోసపోయానని గుర్తించిన ఆమె బుధవారం ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా వర్సిటీలో పరిశోధనా ప్రాజెక్టులో రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టుకు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలి. 27న ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఎంపీఈడీ, ఎమ్మెస్సీ హోంసైన్స్ చదువుకున్న వారు అర్హులు. ఇతర వివరాలకు ఎస్‌పీఎంవీవీ.. వెబ్‌సైట్ చూడాలని వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని కోరారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిద్దాం

డీఎస్‌డీవోలతో సమీక్షించిన శాప్ చైర్మన్



డీఎస్‌డీవోలతో సమీక్షిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సాహించి వారి ప్రతిభను గుర్తించే చర్యలు చేపడదామని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు అధికారులకు సూచించారు. బుధవారం ఆయన స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల డీఎస్‌డీవోలు సయ్యద్‌సాహెబ్, బాలాజీలతో సమీక్షించారు. ఆర్థిక స్తోమత లేకుండా గ్రామీణ క్రీడాకారులు చదువులకే పరిమితవుతున్నారని, సత్తా ఉన్నా క్రీడల్లో వెనుకబడిపోతున్నారని గుర్తు చేశారు. అలాంటివారిని గుర్తించి దాతల సాయంతో చేయూతనందించే బాధ్యతలు తీసుకుందామన్నారు. గ్రామీణ పాఠశాలలలో పర్యటించి పీఈటీల ద్వారా క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను ఎంపిక చేయలన్నారు. అమరరాజ సంస్థలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన సహదేవనాయుడు ముందుకొచ్చి తాను సహకరిస్తానన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని, ఫలితాలను బట్టి ఇతర జిల్లాల్లోనూ అమలు చేద్దామని రవినాయుడు దిశానిర్దేశం చేశారు.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

- ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్న ఎమ్మెల్యే, కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యమిస్తూ వైభవోపేతంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్, కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ముక్కంటి ఆలయ పరిపాలన భవనంలో బుధవారం మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో తొలి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆలయ ఈవో బాపిరెడ్డితోను.. పోలీసు, మున్సిపల్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ, అగ్నిమాపక, వైద్య తదితర శాఖల అధికారులతో ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఏర్పాట్లు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ హయాంలో జరిగిన మహాశివరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి స్వామివారి గర్భగుడి వద్ద బైఠాయించి సామాన్య భక్తులను ఇబ్బందులకు గురిచేశారు. వారి పార్టీ కార్యకర్తలను దళారులుగా మార్చారు. ఇప్పుడు అలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తాం. భక్తులందరూ సులభంగా టిక్కెట్లు కొనుగోలు చేసేలా 14 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఈ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గించేందుకు అన్ని పత్రికల్లో బార్‌కోడ్ ద్వారా ప్రకటనలు ఇస్తాం. దీంతో ఆన్‌లైన్‌లోనూ దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసేలా శ్రీకారం చుడుతున్నాం' అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు.

10 లక్షల మందికి దర్శనం

వీఐపీల కోసం ప్రత్యేక టైంస్లాట్ కేటాయించడంపై కసరత్తు చేస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. 13రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో సుమారు 10లక్షల మంది భక్తులకు దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. సాధారణ రోజుల్లో 750మందిని, కీలక రోజులుగా అదనంగా మరో 450మందిని బందోబస్తుకు కేటాయిస్తామన్నారు. ప్రస్తుతం 175 మరుగుదొడ్లు ఉండగా, ఫిబ్రవరి 21 నుంచి మార్చి 6 వరకు అదనంగా 200 మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం పట్టణ పారిశుధ్య సిబ్బందితో పాటు పొరుగు మండలాలు, మున్సిపాలిటీల నుంచి సిబ్బందిని బ్రహ్మోత్సవాలకు వినియోగిస్తామని వెల్లడించారు. పట్టణవ్యాప్తంగా సీసీ కెమెరాలు, డ్రోన్లతో పర్యవేక్షిస్తామన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక బృందాలను నియమిస్తామన్నారు. 13రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో విద్యుత్, ఆహారం, తాగునీరు సరఫరాకు ఎక్కడా చిన్న ఆటంకం కూడా ఏర్పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశుఘోష

యథేచ్ఛగా కబేళాలకు గోవులు, లేగదూడల తరలింపు



లారీలో కుక్కేసి కబేళాలకు తరలిస్తున్న గోవులు



పుంగనూరు వద్ద ఇటీవల గోవుల లారీని అడ్డుకుంటున్న జనం

పుంగనూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మీదుగా రోజూ దాదాపు 40 లారీల్లో పశువులను, బర్రెలను తమిళనాడు, కేరళ రాష్ట్రాల కబేళాలకు గో మాఫియా తరలిస్తోంది. గాలి, వెలుతురు, నిలబడే స్థలం కూడా లేని లారీల్లో కుక్కేసి కబేళాలకు తరలిస్తున్నారు. లేగ దూడలను సైతం లారీల్లో కుక్కి కోతకు పంపుతున్నారు. తెలంగాణ, కర్నూలు, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి గూడ్స్ లారీల్లో వస్తున్న గోవులను అడ్డుకోకుండా పోలీసులకు, చెక్‌పోస్టుల్లో సిబ్బందికి ముందుగానే నజరానాలు సమర్పించి ఏమాత్రం ఇబ్బందిలేకుండా గో మాఫియా తన పని జరుపుకుంటోంది. పోలీస్‌స్టేషన్ల వద్ద దర్జాగా పశువుల లారీలో నుంచి ఒక వ్యక్తి వచ్చి డబ్బులిచ్చి వెళుతున్నారంటే గోమాఫియా ఎంత బలంగా తయారైందో తెలుస్తోంది. పుంగనూరు పరిసరప్రాంతాలు పశుసంపదకు పుట్టిల్లుగా పేరుగాంచాయి.అయితే కొన్నేళ్లుగా పాలకు ప్రైవేటు డెయిరీలు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం, పశుపోషణ కష్టంగా మారడంతో పశువులు తగ్గిపోతున్నాయి. పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రతి గురువారం జరిగే సంతలో లేగదూడలు, కోడెగిత్తలు, ఎద్దులు, వయసు మళ్లిన పాడిఆవులు, బర్రెల క్రయవిక్రయాలు సాగుతున్నాయి. దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి తమిళనాడు, కేరళలోని వివిధ ప్రాంతాల్లో గల కబేళాలకు తరలిస్తున్నారు.ఇందుకోసం లారీలను గూడ్స్‌లారీలుగా వెనుక బాడీని పెంచి టార్పాలిన్ పట్టతో కప్పి పైనమాత్రం పశువులకు గాలి వచ్చేలా రంధ్రం ఉంచి గోవధ లారీలను ప్రత్యేకంగా రూపొందించారు.పశువులను ఇతర ప్రాంతాలకు తరలించాలంటే పశురవాణా చట్టం ప్రకారం ఒక్కో లారీలో పశువులు 6 మాత్రమే వుండాలి.అయితే గో మాఫియా దాదాపు 40 పశువులను తరలిస్తోంది. వాహనంలో పశువులకు అవసరమైన గాలి,వెలుతురుతో పాటు ఆహారం, నీరు అందుబాటులో ఉంచి గంటకు ఒకసారి వాహనం ఆపి పశువులను గమనించాలి. గాయాలున్నా, ఊపిరాడక చనిపోయినా బండి ముందుకు వెళ్లకూడదు. సంబంధిత మండల, డివిజన్ పశుసంవర్ధక శాఖ అధికారి నుంచి అనుమతి తీసుకోవాలి.అయితే గో మాఫియా ఇవేమీ పాటించడంలేదు. గతనెల 26వ తేది పుంగనూరు బైపాస్‌రోడ్డులో హిందూపరిరక్షణ సమితి యువత తెలంగాణా నుంచి వస్తున్న మాలిక్ గూడ్స్‌లారీలో 35 పశువులు, 7బర్రెలు తరలిస్తుండగా అడ్డుకుని పుంగనూరు పోలీసులకు అప్పగించారు. లారీలో పశువులను కుక్కేసి తలలు మాత్రం పైకి గాలి పీల్చుకునేలా తాళ్లతో కట్టేసి,కనీసం నిలవడానికి స్థలంలేక ఒకదానిపై మరొకటి చొప్పున కుక్కేసి తరలించడం చూసిన వారు నివ్వెరపోయారు. తర్వాత 27వ తేది రాత్రి మరోలారీని అడ్డుకుని పోలీసులకు అప్పగించారు.వారం క్రితం పుంగనూరు టోల్‌ప్లాజా వద్ద అఖిల భారత గోసంరక్షణ మహాసంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.ఆయూబ్‌ఖాన్ ఏపీ39టీఎఫ్4464 , మరో లారీలో గోవులను కబేళాలకు తీసుకెళుతుండగా అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చినా ఎవరూ స్పందించలేదు.ఈలోపు తన కారును నెట్టుకుంటూ లారీలు వెళ్లిపోయినట్లు తెలిపారు. ఈవిధంగా గోవుల లారీ వచ్చే సమయంలో కొందరు గో మాఫియా దళారులు లారీలను పంపేందుకు సిద్ధంగా ఉంటున్నారు.ఇప్పటికైనా గోవులను కబేళాలకు తరలించకుండా కాపాడేందుకు పోలీసు, రవాణా, పశుసంవర్ధకశాఖ, విజిలెన్స్ రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.



కబేళాలకు వెళ్లేందుకు పుంగనూరు సంతలో ఉన్న పశువులు

పోలీసులు స్పందించడంలేదు



పుంగనూరు మార్గంలో రోజూ అక్రమంగా మూగ జీవాలను కబేళాలకు తరలిస్తున్నారు.పోలీసులకు సమాచారమిస్తున్నా వారు ఏమాత్రం స్పందించడం లేదు. చట్టాన్ని అమలు చేసి అక్రమంగా గోవధకు పశువులు తరలకుండా చేయాలని అనేక మార్లు ఎస్పీ, డీఎస్పీ,సీఐ, ఎస్ఐలకు ఫిర్యాదులు చేసినా వారు పట్టించుకోవడంలేదు. ప్రధానమంత్రి, హోం మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎంలకు గోవధ చట్టాలను అమలు చేసి పుంగనూరులో పశువులను కాపాడాలని లేఖలు పంపుతున్నా.

- పి.ఆయూబ్‌ఖాన్, అఖిల భారత గోసంరక్షణ మహాసంఘ్ ప్రధాన కార్యదర్శి

విద్యా సంస్థల్లో ఓటరు దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

● డీఈవో వరలక్ష్మి



చిత్తూరు సెంట్రల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లో విద్యాశాఖ-సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25న శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో వరలక్ష్మి, ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం డీఈవో కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో జాతీయ ఓటరు దినోత్సవంపై వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు, మరో రెండు రోజులు నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం ప్రతి పాఠశాలలో ఓటరు ప్రతిజ్ఞ, ఓటు ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా వక్తల ప్రసంగాలు ఉంటాయన్నారు. చిత్తూరులోని జూనియర్ కళాశాలలను సమన్వయం చేసుకుని స్థానిక గాంధీ విగ్రహ కూడలి నుంచి నాగయ్య కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం పెరేడ్ మైదానంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవానికి విద్యాశాఖ శకటం ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీసీ వెంకటరమణ తెలిపారు.

కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు అసత్య ప్రచారాలు మానుకోవాలి:టీడీపీ



మాట్లాడుతున్న సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు అసత్య ప్రచారాలను మానుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ హెచ్చరించారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి వైసీపీ నేతలు అసత్య ప్రచారాలు చేస్తూనే ఉన్నారన్నారు. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన, విశాఖ ఉక్కుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా తీసుకువచ్చిన ఆర్థిక ప్రాజెక్టుపై కూడా తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులపై ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సహకారంతో రూ21 వేల కోట్ల రూపాయలతో అమరావతిలో పనులు పునఃప్రారంభించినట్లు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు 2019లో అప్పటి సీఎం జగన్ ఒకసారి దావోస్‌కు వెళ్లి ఒట్టి చేతులతో తిరిగి వచ్చారని గుర్తు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నేతలు మోహన్ రాజ్, మేషాక్, సురేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన బస్సు ప్రమాదం

● కేకలు వేసిన ప్రయాణికులు



గెరిగిదొన వద్ద ఒరిగిన బస్సు

వెదురుకుప్పం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తృటిలో బస్సు ప్రమాదం తప్పడంతో ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో బుధవారం వెదురుకుప్పం మండలంలో జరిగింది. తిరుపతి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఎస్ఆర్‌పురం నుంచి కార్వేటినగరం, వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం మీదుగా తిరుపతి వెళ్తోంది. ఈ క్రమంలో ఎస్ఆర్ పురం నుంచి వెదురుకుప్పం మండలం గెరిగిదొన సమీపానికి వచ్చే సరికి రోడ్డు పక్కకు వెళ్లడంతో కేబుల్ కోసం తీసిన గొయ్యిలో మట్టి ఉన్నప్పటికీ దిగబడిపోవడంతో బస్సు ఒరిగిపోయింది. దీంతో భయాందోళనకు గురైన ప్రయాణీకులు ప్రాణ భయంతో కేకలు, అరుపులతో దిగిపోయరని స్థానికులు తెలిపారు. బస్సు బోల్తా పడకపోవడంతో ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు. త్రుటిలో ప్రమాదం తప్పింది.

26న రాష్ట్ర స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఎస్‌పీఎస్ఆర్‌సీ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6వ తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేధ 2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్టు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురితో కలిసి ఉన్న ఒక టీమ్ మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490336550ను సంప్రదించాలన్నారు.

నేడు రాళ్లపల్లె అనంతకృష్ణశర్మ జయంతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సాహిత్య, సంగీతవేత్త రాళ్లపల్లె అనంతకృష్ణశర్మ 133వ జయంతి కార్యక్రమం నగరంలో నిర్వహించనున్నారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూ ధార్మిక సంస్థలు సంయుక్తంగా గురువారం ఉదయం 10 గంటలకు అన్నమాచార్య కళా మందిరంలో ఈ కార్యక్రమం చేపట్టనున్నాయి. అనంతపురం జిల్లా రాళ్లపల్లె గ్రామంలో 1893 జనవరి 23వ తేదీన అనంతకృష్ణశర్మ జన్మించారు. మైసూరు మహారాజ కాలేజీలో 8 ఏళ్లు తెలుగు ఆచార్యులుగా సేవలందించారు. రేడియోకు ఆకాశవాణి అని పేరు పెట్టింది ఆయనే. ఆయన ప్రతిభను గుర్తించి నాటి టీటీడీ ఈవో చెలికాని అన్నారావు 1949లో ఓఆర్ఐ నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. అన్నమయ్య రాసిన వందల సంకీర్తనలను పరిష్కరించడం, స్వర పరచడం, గ్రంథస్తం చేయడంలో రాళ్లపల్లె కృషి చేశారు. 1979 మార్చి 11న టీటీడీ ఆస్థాన విద్వాంసులుగా చేరారు. ఇలా సాహిత్య, సంగీత రంగాల్లో విశేష సేవలు అందించిన రాళ్లపల్లె అనంతకృష్ణశర్మ జయంతిని టీటీడీ అధికారికంగా నిర్వహించనుంది.

ఉపాధిలో ఆరోస్థానం

పురోగతిలో గోకులం షెడ్లు, సీసీ రోడ్ల నిర్మాణాలు



గోకులం షెడ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న డ్వామా పీడీ రవికుమార్

చిత్తూరు సెంట్రల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం జిల్లాలో ఊపందుకుంది. డ్వామా కూడా తగిన చర్యలు చేపట్టడంతో రాష్ట్రస్థాయిలో మన జిల్లా 23వ స్థానం నుంచి ఆరో స్థానానికి చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా 1,38,747 కుటుంబాల్లో 65,57,079 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. 2024-25 వార్షిక సంవత్సరానికి 82 లక్షల పనిదినాల లక్ష్యంలో గురువారం నాటికి 72 లక్షల పనిదినాలు పూర్తి చేశారు. కూలీల వేతనాలతో పాటు మెటీరియల్ వర్కులు, సీసీ రోడ్లు, గోకులం షెడ్లు, నర్సరీ ఇలా అన్ని విభాగాలకు 2024 ఏప్రిల్ ఒకటి నుంచి డిసెంబరు నెలాఖరు వరకు రూ.183 కోట్ల చెల్లింపులు చేశారు.

చెల్లింపులు.. నిర్మాణాలు

మెటీరియల్ కాంపొనెంట్ కింద చేపట్టిన పనులకు పెండింగ్ మొత్తంలో రూ.40 కోట్లు చెల్లింపులు జరిగాయి. 179 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్లకు 94 కిలోమీటర్ల మేర నిర్మాణాలు పూర్తి చేశారు. ఇందుకుగాను రూ.23కోట్లను చెల్లించారు. డ్వామా, పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో 2,197 గోకులం షెడ్ల నిర్మాణాల లక్ష్యం పెట్టుకోగా, గురువారంనాటికి 860 నిర్మాణాలు పూర్తిచేసి, జిల్లాను మొదటి స్థానంలో నిలిపారు. సామాజిక అటవీ విభాగం కింద ఏడాది లక్ష్యంగా రూ.5కోట్లు ఖర్చుచేసి 30 లక్షల మొక్కలు పెంచి, ఉచితంగా అందజేసే ప్రక్రియను చేపట్టారు.

మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి



కలెక్టర్ సహకారంలో ఉపాధి పనులు, పురోగతిలో 26వ స్థానంలోని జిల్లాను మూడు నెలల కాలంలో ఆరో స్థానానికి చేర్చాం. మార్చి నాటికి ఉపాధి కూలీలకు 10 లక్షల పనిదినాలు పూర్తి చేయడంతోపాటు పూర్తి స్థాయి వేతనాలు చెల్లించి, అన్ని విభాగాల్లో పురోగతి సాధించి జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నాం.

- రవికుమార్, డ్వామా పీడీ

రహదారి నియమాలను అతిక్రమించం

● అవగాహనా ర్యాలీలో ప్రతిజ్ఞ



ప్రజలచేత ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు నివారించాలంటే రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్ చెప్పారు. 36వ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో బుధవారం చిత్తూరులో దర్గా సర్కిల్ లోని అంబేద్కర్ విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిలో 90 శాతం యువతే ఉన్నారన్నారు.కాబట్టే జిల్లా యంత్రాంగం కళాశాలలకు వెళ్లి రహదారి భద్రతా నియమాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు.మద్యం సేవించి వాహనాలు నడపడం,హెల్మెట్ లేకుండా అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ఏదో ఒక రోజు ప్రమాదాల బారిన పడతారని హెచ్చరించారు. ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించడానికి నగరంలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించామన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించడంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం రహదారి భద్రతా నియమాలు పాటిస్తామని, అందరికీ సూచనలు చేస్తూ , ఇతరులను చైతన్య పరుస్తూ , ప్రభుత్వం సూచించిన రహదారి నియమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అతిక్రమించమంటూ దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నామని ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు.చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, డీటీసీ నిరంజన్ రెడ్డి, ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు రాజేశ్వర రావు, మురళి, నరసింహులు, దీపిక, పోలీసు అధికారులు, డ్రైవింగ్ స్కూల్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ



పరుగుపందెంలో పాల్గొన్న అభ్యర్థులు - ఛాతీ కొలతను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గత 22 రోజులుగా జరిగిన పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య, సామర్థ్య పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఎస్పీ మణికంఠ చ ందోలు ప్రత్యేక పర్యవేక్షణలో ఎంపిక ప్రక్రియ జరిగింది. మొత్తం 5238 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా.. 3799 మంది హాజరయ్యారు. వీరిలో 1683 మంది రాతపరీక్షకు అర్హత సాధించారు. అత్యాధునిక సాంకేతిక పరికరాల సహాయంతో, ఏపీ స్టేట్ లెవల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నియమనిబంధనల మేరకు 25 సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఎంపిక ప్రక్రియ జరిగింది. ఈ పరీక్షలు ప్రతి రోజు ఉదయం 5 గంటలకు ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగాయి. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పొరబాట్లు జరగకుండా నిర్వహించిన సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

దివంగత అటవీశాఖాధికారి ఫ్యామిలీ పెన్షన్‌లో రికవరీ

పుత్తూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ఆర్థిక పరమైన నష్టం కలిగించిన దివంగత పుత్తూరు ఫారెస్ట్ అధికారి సుబ్రహ్మణ్యం మీద చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ బుధవారం ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది, గతంలో పుత్తూరు అటవీశాఖాధికారిగా పనిచేస్తూ ఆయన పదవీ విరమణ తర్వాత రెండేళ్ల క్రితం మరణించారు. ప్రస్తుతం ఆయన వారసులు పెన్షన్‌ను పొందుతున్నారు. ఈ క్ర మంలో గతంలో ఆయన మీద నమోదైన దాదాపు 12 కేసుల పూర్వాపరాలను పరిశీలించిన రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక అధికారి అనంతరాము ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేశారు. ఆయన ఫ్యామిలీ పెన్షన్ నుంచి ప్రభుత్వ నష్టాన్ని వసూలు చేయాలని జిల్లా అటవీశాఖాధి కారులను ఆదేశించారు.

నకిలీ బంగారం ముఠా అరెస్ట్

కుప్పంవాసుల ఫిర్యాదుతో 10మంది నిందితుల పట్టివేత

సోమందేపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారం హారాలు చూపి డబ్బులతో ఉడాయించే ముఠా సభ్యులను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. సోమందేపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలను వెల్లడించారు. ఎక్స్‌కవేటర్‌తో పొలాలను దున్నుతుంటే పాతకాలంనాటి బంగారం హారాలు లభ్యమయ్యాయని నమ్మబలికి.. వాటిని తక్కువ ధరకే ఇస్తామని ఆశ చూపి మోసం చేసే ముఠా సభ్యులు హిందూపురం నుంచి పెనుకొండ వైపు వస్తున్నారని తెలిసి దారికాశామన్నారు. 10 మంది ముఠా సభ్యులు దోచుకున్న సొమ్మును పంచుకుంటుండగా వలపన్ని పట్టుకున్నామని తెలిపారు. అదుపులోకి తీసుకుని విచారిస్తే నేరాన్ని ఒప్పుకున్నట్లు వెల్లడించారు. దీనిపై చిత్తూరు జిల్లా కుప్పం మండలం పైపాళ్యంలో వెంకటేశ్, విడపనకల్లుకు చెందిన ఈరన్న అనే వ్యక్తులు గతంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వీరిని సోమందేపల్లి మండలం బ్రాహ్మణపల్లి వద్దకు పిలిపించి, మాటల్లో మభ్యపెట్టి వారి వద్ద నుంచి నగదు తీసుకుని ఉడాయించారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమందేపల్లి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారని అన్నారు. రెండు కేసుల్లో రూ.24 లక్షలు కాజేసినట్లు వివరించారు. నకిలీ హారాలతో మోసం చేసిన నిందితులు రాణా కిష్టబాబు, ఏఆర్ శాంతరాజు, నయాజ్ అహ్మద్, ఎం. ఈరన్న, బాబు, షికారి అర్జున్, గోవిందుల ఆనంద్‌బాబు, సోమాల్ బంగారి, ఈడిగ హరిప్రసాద్, పిచ్చిగుంట్ల మారెప్పను అరెస్ట్ చేసి కేసు నమోదుచేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.21 లక్షల నగదు, ఐదు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ద్రావిడ వర్సిటీలో న్యాక్ కమిటీ



ద్రావిడ వర్సిటీ అధికారులతో సమావేశమైన న్యాక్ కమిటీ సభ్యులు

గుడుపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయానికి బుధవారం న్యాక్ కమిటీ వచ్చింది. వీసీ దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్ కుమార్ న్యాక్ కమిటీ సభ్యులకు స్వాగతం పలికారు. అనంతరం పరిపాలనా భవనంలో వీసీ, రిజిస్ట్రార్, ఇతర అధికారులతో న్యాక్ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. తరువాత విశ్వవిద్యాలయంలోని శాఖలను సందర్శించి అధ్యాపకుల , విద్యార్థుల వివరాలను తెలుసుకొన్నారు.శాఖాధిపతులు వారివారి శాఖల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా న్యాక్ కమిటీకి వివరించారు. అనంతరం సమావేశపు హాల్లో విద్యార్థులతో న్యాక్ కమిటీ సమావేశమైంది. ద్రావిడ వర్సిటీలోని కేంద్రీయ గ్రంథాలయాన్ని న్యాక్ కమిటీ సభ్యులు సందర్శించారు. తరువాత న్యాక్ కమిటీ సభ్యులు విశ్వవిద్యాలయంలోని బోధనేతర సిబ్బందితో సమావేశమయ్యారు.సాయంత్రం అధ్యాపకులతో సమావేశమై వివరాలను తెలుసుకొన్నారు. రాత్రి విశ్వవిద్యాలయం ఓపెన్ ఆడిటోరియంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను న్యాక్ కమిటీ బృందం తిలకించింది.న్యాక్ కమిటీ సభ్యులు విమల్ కిషోర్, కనిక శర్మ, అరుణ్ ఎస్.కరత్, హెచ్.ఎన్.వగీలా, సత్య ప్రకాష్ నికోసి, రితూ లిహల్ పాల్గొన్నారు.

ఎంబీయూలో పరిశోధక వర్క్‌షాప్ ప్రారంభం

చంద్రగిరి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థులకు రీసెర్చ్ మెథడాలజీ అండ్ పబ్లికేషన్స్ ఎథిక్స్ అనే అంశంపై బుధవారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. సింగపూర్‌లోని నవ్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ విశ్రాంతి ఆచార్యులు సుందరరాజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వర్క్‌షాపు మూడు రోజుల పాటు జరగనుంది.

సిమ్‌లిచ్చాక నెట్‌వర్క్ హుష్‌కాకి..!



అడవి ములకపల్లెలో బీఎస్ఎన్ఎల్ టవర్

కుప్పం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ తన తీరు మార్చుకోవడంలేదు. ప్రైవేటు టెలికాం కంపెనీలు వేలు, లక్షల కనెక్షన్లతో మార్కెట్లో దూసుకుపోతుంటే బీఎస్ఎన్ఎల్ తీరు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది. కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ, అడవి ముకలపల్లె గ్రామంలో ఏర్పాటుచేసిన ఈ కేంద్ర ప్రభుత్వ టెలికాం సంస్థ సెల్ టవర్ సరిగా పనిచేయకపోవడం దీనికి నిదర్శనం. ఇక్కడ ఇటీవలే బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ టవర్ నూతనంగా ఏర్పాటు చేశారు. దీంతో నెట్వర్క్ బాగా పనిచేస్తుందని ఊదరగొట్టి చెక్కునత్తం పంచాయతీతోపాటు పరిసర పంచాయతీల్లో సిమ్ కార్డులు జారీ చేశారు. ఇతర ప్రైవేటు టెలికాం నెట్వర్క్‌ల ఛార్జీలు అపరిమితంగా పెరిగిపోవడంతో ప్రజలు సైతం ఈ సిమ్‌కార్డులను అధిక సంఖ్యలోనే కొనుగోలు చేశారు. అయితే బీఎస్ఎన్ఎల్ సామర్థ్యం ఇప్పుడు బయటపడుతోంది. కేంద్ర ప్రభుత్వ టెలికాం సంస్థ జారీ చేసిన సిమ్‌లు పనిచేయడం లేదు. నెట్వర్క్ పరిసర గ్రామాలకు అందడం లేదు. దీంతో ప్రైవేటు ఆపరేటర్లను కాదనుకుని బీఎస్ఎన్ఎల్ సిమ్‌లు తీసిన గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ టవర్ సామర్థ్యం పెంపునకు చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

25న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

పలమనేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. వెంకటేశులు తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఫెయిల్, పాసైన అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరలోపు వయస్సున్న వారు హాజరు కావొచ్చని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ అదాలత్‌లో 10 అర్జీలు



అర్జీ అందిస్తున్న విద్యుత్ వినియోగదారుడు

పలమనేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పలమనేరు విద్యుత్ ఏడీఈ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యుత్ అదాలత్‌ 10 మంది విద్యుత్ వినియోగదారులు పలు సమస్యలపై అర్జీలు అందించారు. ఈ విద్యుత్ అదాలత్ లో సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ రిటైర్డు జడ్జి శ్రీనివాస ఆంజనేయప్రసాద్ అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈఈ శ్రీనివాస మూర్తితో పాటు పలమనేరు, పుంగనూరు, సదుం ట్రాన్స్‌కో డీఈలు పాల్గొన్నారు.

మాజీ సైనికుల భవన నిర్మాణానికి సహకరించాలి



చల్లా రామచంద్రారెడ్డిని కలిసిన మాజీ సైనికులు

పుంగనూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాంపల్లె వద్ద నిర్మిణ దశలో ఉన్న మాజీ సైనికుల భవనాన్ని పూర్తి చేయడానికి సహకరించాలని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని కోరినట్లు పుంగనూరు మాజీ సైనికుల గౌరవాధ్యక్షుడు విశ్రాంత డీఎస్పీ సుకుమార్ తెలిపారు. బుధవారం రొంపిచెర్లలోని ఆయన స్వగృహంలో కలిసి వినతి పత్రం అందజేశారు. 26న నిర్వహించే రిపబ్లిక్‌డేకు ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికులు ప్రతినిధులు రెడ్డెప్ప, జవహర్, ప్రతాప్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం: చల్లా

రొంపిచెర్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం చల్లా బాబు ఇంటి వద్ద సోమల, చౌడేపల్లి మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు కలిసి సమస్యలు, అభివృద్ధి పనుల పై వివరించారు. చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్ర రాష్ట్రానికి మణిహారమని.. కూటమి ప్రభుత్వంతో గట్టెక్కించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో రొంపిచెర్ల, సోమల, చౌడేపల్లి టీడీపీ పార్టీ అధ్యక్షులు ఉయ్యాల రమణ, సుబ్రమణ్యం నాయుడు, రమేష్‌రెడ్డి, నాయకులు విశ్వనాధ, రామకృష్ణ, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, లక్ష్మయ్య, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి మూలానికి ఔషధం ఆయుర్వేదం



● ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ హేమలత



కుప్పం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదం వ్యాధిని మూలం నుంచి నిర్మూలిస్తుందని కుప్పం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ హేమలత అన్నారు. ముఖ్యంగా ఆయుర్వేద మందులు తీసుకోవడంతో ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని చెప్పారు. ఆయుర్వేద వైద్యం ప్రాముఖ్యం గురించి ఆమె చెప్పిన మాటలు క్లుప్తంగా..

ఆయుర్వేదం శాస్త్రీయమైన వైద్యవిధానం

! ఆయుర్వేదం మన పూర్వకాలం నుంచి సంప్రదాయంగా వస్తున్న శాస్త్రీయమైన వైద్యవిధానం. ఇది పైపైన కాకుండా మూలం నుంచి వ్యాధిని నిర్మూలిస్తుంది. అంటే ఔషధం వాడిన తర్వాత తగ్గిన వ్యాధి తిరిగి మళ్లీ వ్యాపించదు. ముఖ్యంగా ఒక వ్యాధికి మందు తీసుకుంటే మరో వ్యాధి ఉత్పన్నం కాదు. ఆయుర్వేద మందులతో ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు.

ఆయుర్వేదంలో రెండు రకాల మందులు

! ఆయుర్వేద మందులు ముఖ్యంగా రెండు రకాలు. ఒకటి వనౌషధాలు. వీటిని మొక్కల నుంచి తయారు చేస్తారు. మరో రకం రసౌషధాలు. వీటిని రసం అంటే పాదరసం ఉపయోగించి రూపొందిస్తారు.

అన్నిరకాల వ్యాధులకు ఆయుర్వేదం

! ఆయుర్వేదం దాదాపు అన్నిరకాల వ్యాధులను సమర్థంగా నిర్మూలించగలదు. చర్మ వ్యాధులు, జలుబు, దగ్గువంటి శ్వాసకోశ వ్యాధులు, రుతుక్రమం సరిగా లేకపోవడం, తెల్లబట్ట వంటి స్త్రీ సంబంధిత వ్యాధులు మొలలు, మలబద్ధకం వంటి మూత్ర సంబంధిత వ్యాధులు వంటివన్నీ ఆయుర్వేద ఔషధాలకు లొంగుతాయి. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు కూడా ఇందులో మందులు ఉన్నాయి . అయితే వాటిని అల్లోపతి మెడిసిన్‌కు సపోర్టివ్‌గానే వాడాల్సి ఉంటుంది.

ఆయుర్వేదానికి ఆదరణ తక్కువ

! అల్లోపతి టమందులతో పోలిస్తే ఆయుర్వేద ఔషధాలు తక్షణ ఉపశమనం కలిగించవు. కొన్ని రసౌషధాలకు ఈ గుణం ఉంటుంది గాని అధిక శాతం ఔషధాలు దీర్ఘకాలం తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే వ్యాధి మూలం నిర్మూలన అయి శాశ్వతంగా ఆ వ్యాధి నుంచి రోగులు విముక్తలవుతారు. అయితే ఇప్పుడు అన్నింట్లో వేగం పెరిగింది. జబ్బులు వెంట వెంటనే తగ్గిపోవాలని మనుషులు ఆశిస్తున్నారు. అలా తగ్గితేనే వ్యాధితో మందగించిన నిత్యజీవన వ్యవహారాలను చక్కబెట్టుకోగలరు. ఆయుర్వేద ఔషధాలతో వైద్యం దీర్ఘకాలం తీసుకోవాల్సి ఉంటుంది. వ్యాధి కూడా నెమ్మదిగా నిర్మూలన అవుతుంది. ఈ ఆలస్యంతోనే ఆయుర్వేదానికి ఆదరణ కొంచెం తక్కువ.

ఫటా ఫట్?

గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం

! కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలోనే ఆయుర్వేద ప్రభుత్వాసుపత్రి ఉంది. ఇక్కడికి రోజువారీగా సరాసరిన 30 నుంచి 40 మంది వివిధ వ్యాధులతో వస్తుంటారు. కొత్తవారి కంటే రిపీటెడ్‌గా వచ్చే రోగులు ఎక్కువ. ఒక్కసారి ఆయుర్వేద వైద్యానికి అలవాటు పడినవారు, అందులోని సౌలభ్యం, దీర్ఘకాలంలోనైనా సరే ఔషధంతో కలిగే ఉపశమనం కారణంగా అలాగే కొనసాగుతారు. ఇక కొత్త రోగులను ఆకట్టుకునేందుకు, ఇప్పుడిప్పుడే గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామీణులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడమేకాక, ఆయుర్వేద వైద్యం విశిష్టత గురించి వివరిస్తున్నాం.

ఉచితంగానే మందులు

! ఆయుర్వేదం సశాస్త్రీయమైన ప్రాచీన మునిరుష్య పరంపర నుంచి వచ్చిన వైద్యం. ఇది మూలాలను నిర్మూలిస్తుంది. ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తోంది. బయటి షాపుల్లో అధిక ధరలకు విక్రయించే మందులు ఆసుపత్రికి వచ్చే రోగులందరికీ ఉచితంగానే ఇస్తున్నాం. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకుని ఆరోగ్యవంతులు కావాలి.

ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ బుజ్జి

పుంగనూరు రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తయిండ్లు మున్సిపల్ పాఠశాలను బుధవారం రాష్ట్ర ఎస్ఆర్‌పీ ఎం. బుజ్జి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదుల్లో విద్యుత్ సౌకర్యం, వసతులను పరిశీలించారు. డీఆర్‌పీలు రమేశ్, కిరణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ● రొంపిచెర్ల: రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో నాబార్డు నిధులతో నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా డ్వామా డీఆర్‌పీ సురేంద్రరెడ్డి సూచించారు. రికార్డులు, మధ్యాహ్న భోజనం, పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు పరిశీలించారు. బుధవారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో బహిరంగ సమావేశం నిర్వహించారు. పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంఈవో శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి, లోకనాధరెడ్డి, కృష్ణయ్య, ఎస్ఎంసీ చైర్మన్ హీనా, మదరసా కమిటీ చైర్మన్ గౌస్‌పీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చౌడేపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని ప్రధానోపాధ్యాయులు నాగరాజరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు ఈనెల 25న ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటు హక్కుపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈనెల 26న బహుమతులు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్, మురళీ, ఈశ్వర్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



చౌడేశ్వరమ్మ ఆలయం వద్ద భక్తులు

రామకుప్పం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. కంబాలదేవులపల్లెలోని సప్తమాతృక సమేత చౌడేశ్వరమ్మ ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టారు. అనంతరం పేరూరు కుంటిగంగమ్మ, రామకుప్పం పెట్రోలు బంకు వద్ద ఉన్న సల్లాపురెమ్మ, దిగువవీధి గంగమ్మ, రెడ్డివీధిలోని పెద్ద పులిగంగమ్మ, చౌడేశ్వరమ్మ, మేలుపులెమ్మ సల్లాపురెమ్మ, రామనగర్ గంగమ్మ, కోందరామనగర్ గంగమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



కోళ్లకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి చందన ప్రియ

సోమల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. బుధవారం మిట్టపల్లెలో పశువైద్యశిబిరం నిర్వహించారు. పాడి పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశువైద్యాధికారి చందనప్రియ వివరించారు. పశువులకు, కోళ్లకు చికిత్సలు అందించారు. కార్యక్రమంలో కందూరు మాజీ ఎంపీటీసీ పి. శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరం నిర్మించి ఏడాది పూర్తి కావడంతో పుంగనూరులో కళాశాల విద్యార్థులతో కలిసి హైందవ సంఘ నాయకులు బుధవారం ఇందిరాసర్కిల్‌లో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో హైందవ సంఘ నాయకులు మదన్‌మోహన్, రాజారెడ్డి, త్రిమూర్తిరెడ్డి, జగదీశ్, ప్రేమ్ కుమార్, విజయశంకర్, ప్రసాద్, మఠం బాబు, మల్లికరాణి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ అవసరం



సోమల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై విద్యా కమిటీ, ఉపాధ్యాయుల పర్యవేక్షణ అవసరమని ఎంఈవో శివరత్న తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. నిధుల మంజూరు, ఖర్చుల వివరాలను విద్యా కమిటీ సభ్యుల ఎదుట వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్ఠతకు లోకేశ్ పాత్ర కీలకం: గౌనివారి

శాంతిపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీని పటిష్ఠం చేయడంలో యువనేత నారా లోకేశ్ పాత్ర ఎంతో కీలకమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ లోకేశ్ పార్టీలో క్రియాశీలకమైనప్పటి నుంచి కార్యకర్తల సంక్షేమానికి ఎన్నో విప్లవాత్మక చర్యలు తీసుకున్నారన్నారు. అందులో కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటు ఎంతో ప్రాముఖ్యమైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారన్నారు. దావోస్‌లో పర్యటిస్తున్న ఆయన రాష్ట్రంలో పెట్టుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.

జగదీష్‌నాయుడిని కలిసిన పుంగనూరు నేతలు



పుంగనూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీష్‌నాయుడును పుంగనూరు బీజేపీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. చిత్తూరు జిల్లా కార్యాలయంలో ఆయన్ను కలిసి పుంగనూరు నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ మోర్చా నాయకులు అయూబ్‌ఖాన్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నరసింహులు, అమరనారాయణ, నాగరాజ, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్టు

చౌడేపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పెద్దపంజాణి మండలం నగిరేపల్లెకు చెందిన కరుణాకర్‌రెడ్డి కుమారుడు రామిరెడ్డి చౌడేపల్లె బస్టాండులో మద్యం అక్రమంగా విక్రయిస్తుండగా 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు పేర్కొన్నారు.

లారీ ఢీకొని వృద్ధురాలికి గాయాలు

పుంగనూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి పుంగనూరు మండలంలోని జరిగింది. మదనపల్లె వైపు వెళుతున్న లారీ భీమగానిపల్లెకి చెందిన వెంకటలక్ష్మమ్మ(64) రోడ్డు దాటుతుండగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పెద్దపంజాణి మండలం కంపల్లెకు చెందిన నరసింహులు(60) బుధవారం గాయపడ్డాడు. ఇంటి నిర్మాణ పనులు చూస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జనసేనకు మెండుగా ప్రజల ఆశీస్సులు

గంగవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జనసేనకు మెండుగా ప్రజల ఆశీస్సులు ఉన్నాయని.. జనసేన పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం గాజుగ్లాసు గుర్తును కేటాయించడం సంతోషకరమని గంగవరం మండల జనసేన అధ్యక్షురాలు మంజుల, చంద్ర, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం గంగవరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల తో మాట్లాడారు. ప్రజలకు సేవ చేయాలనే తపనతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముందుకెళుతున్నారని తెలిపారు.

శిథిలావస్థలో పెరియంబాడి మంచినీటి ట్యాంక్



ట్యాంకు నుంచి వృథాగా పోతున్న మంచినీరు

యాదమరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరియంబాడిలో మంచి నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. సుమారు 200 కుటుంబాలు నివాసముంటున్న ఈ గ్రామానికి రక్షిత మంచినీరు సరఫరా చేసే ట్యాంకు పెచ్చులూడి లీకేజి ఏర్పడిన కారణంగా పాచిపట్టి శిథిలావస్థకు చేరుకుంది. సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకుకు మరమ్మతులు చేపట్టి మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దివ్యాంగులు, కిడ్నీ బాధితుల పింఛన్ల పరిశీలన



దివ్యాంగుల పింఛన్లను తనిఖీచేస్తున్న వైద్య బృందం

పాలసముద్రం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దివ్యాంగులు, కిడ్నీ సమస్యలతో బాధపడుతూ పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులను ప్రభుత్వం నియమించిన రెండు వైద్య బృందాలు బుధవారం ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. మండలంలోని 13 పంచాయతీల్లో 45 మంది పింఛను దారులను నేరుగా కలిసి రికార్డులను తనిఖీచేసి, వారి దివ్యాంగ పరిస్థితిని పరిశీలించారు. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి సేకరించిన వివరాలను నివేదిక రూపంలో జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలో డాక్టర్లు ఎస్.అమృత, శివరామ్, ఎం.క్రిష్ణకుమార్, ఆర్.సూర్యుడు, విజయకాంత్, అరుణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం పీహెచ్‌సీ వద్ద నుంచి బుధవారం డాక్టర్ మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో బీసీ కాలనీ వరకు ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు కలిసి కుష్ఠువ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ కుష్ఠువ్యాధిని గుర్తించడానికి మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్యసిబ్బందిచే ఇంటింటి సర్వే చేయిస్తున్నట్లు తెలిపారు. కుష్ఠువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స చేయడానికి సులభంగా ఉంటుందన్నారు. ప్రాథమిక దశలో ఉండేవారికి స్పర్శలేని మచ్చలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, చెవుల వద్ద బుడిపెల్లాంటి లక్షణాలు ఉన్నవారు స్థానిక పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు అరుణ, లక్ష్మి, రేవతి, గంగ పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి సాయం



సాయమందిస్తున్న సహృదయ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు

వెదురుకుప్పం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అభాగ్యులకు సహృదయ సేవా సమితి నిరంతరం అండగా ఉంటుందని ఆ సంస్థ అధ్యక్షుడు టి.తిరుమలయ్య తెలిపారు. కార్వేటినగరంలోని ముస్లీం కాలనీకి చెందిన ఢంకా అఫ్జల్ కొన్నాళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న సమాచారం తెలుసుకున్న తిరుమలయ్య, కార్యదర్శి జయచంద్ర చేతుల మీదుగా తక్షణ సహాయం కింద బుధవారం రూ.26వేలు అందించారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



విద్యార్థుల అభ్యసన తరగతులను పరిశీలిస్తున్న ఎంఈవో రుక్మిణి

యాదమరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్ తెలిపారు. బుధవారం కెగొల్లపల్లె ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల మేథోశక్తిని ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్ పరిశీలించారు. వంద రోజుల ప్రణాళిక నిర్వహిస్తున్న తీరును పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎ.పి.లలిత, ఉపాధ్యాయులు కనకాచారి, నరసింహారెడ్డి, మురళీధర్, భారతి, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కాలభైరవ అష్టమి పూజలు

నగరి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కామాక్షి సమేత కరకంటేశ్వరస్వామి ఆలయంలో కాలభైరవ అష్టమి పూజలు బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి పాలు, పెరుగు, పంచామృతంతో అభిషేకం చేశారు. అనంతరం స్వామిని విభూదితో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

26న మాంసం విక్రయించొద్దు

నగరి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 26వ తేదీ గణతంత్ర దినోత్సవం నాడు మాంసం, రొయ్యలు, చేపలు, పీతలు విక్రయించరాదని కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల వారు సైతం మాంసంతో కూడిన భోజనాలను విక్రయించరాదన్నారు.

25న ఐటీఐలో జాబ్ మేళా

వెదురుకుప్పం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఐటీఐలో ఈ నెల 25వ తేదిన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గణేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా కాళికాదేవి ఆలయ కుంభాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కాళికాదేవి

బంగారుపాళ్యం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రాండ్లపల్లె దళితవాడలో బుధవారం నూతనంగా నిర్మించిన కాళికాదేవి ఆలయంలో కుంభాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 41 రోజుల పూజల అనంతరం కుంభాభిషేకానికి ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం అమ్మవారిని అర్చకులు సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పురవీధుల్లో కాళికాదేవి ప్రతిమను ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. టీడీపీ నాయకుడు కోకా ప్రకాష్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.

సీహెచ్‌సీకి కుర్చీల వితరణ



డాక్టర్ శిరీషకు కుర్చీలు అందజేస్తున్న క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు

బంగారుపాళ్యం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి కాగ్లే కంపెనీ ఆధ్వర్యంలోని క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ వారు రూ.లక్ష విలువ చేసే మూడు సీట్ల స్టీల్ కుర్చీలు మూడు, 20 సాధారణ కుర్చీలను బుధవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శిరీషకు అందజేశారు. ఈ సందర్భంగా క్లాగ్ జెడ్ఎం శ్రీనివాస బాబు, లైజన్ ఆఫీసర్ రమేష్‌బాబు, డీఎం జగదీష్, మేనేజర్, సిబ్బందిని డాక్టర్ శిరీష అభినందించారు.

నేడు నారా లోకేష్ జన్మదిన వేడుకలు

పూతలపట్టు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నేడు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు.

టీడీపీ నేత కుటుంబానికి పరామర్శ



రోశిపిళ్లై కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న భానుప్రకాశ్

నగరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని మాంగాడులో టీడీపీ నేత రోశిపిళ్లై(66) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందడంతో బుధవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. నగరి రూరల్ బ్యాంకు సీఈవో తులసిపిళ్లై సోదరుడైన రోశిపిళ్లై మృతి చెందిన విషయం తెలుసుకున్న చిత్తూరు జిల్లా పీఏసీఎస్ యూనియన్ అధ్యక్షుడు కే.ఎస్.విజయకుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.రమేష్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యేతో పాటు నగరి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సురేష్ నాయుడు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, టీడీపీ మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, రాష్ట్ర టీడీపీ మహిళా అధికార ప్రతినిధి మీరా, జవహర్‌రెడ్డి పరామర్శించారు.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే



రీసర్వేను పరిశీలిస్తున్న జయరాజ్

శ్రీరంగరాజపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే చేపడుతున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజ్ తెలిపారు. బుధవారం ఎస్ఆర్‌పురం మండలం 50 కనికాపురం రెవెన్యూలో జరిగే రీసర్వేను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు భూ సమస్యలుంటే రీసర్వే ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లోకనాథం పిళ్లై, డిప్యూటీ తహసీల్దార్ సురేంద్రబాబు, మండల సర్వేయర్ సురేష్ బాబు, రూత్‌బేబి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చెప్పింది చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



చిన్నముస్తిరికుప్పంలో సీసీరోడ్డును చూపుతున్న చంద్రమోహన్

గుడిపాల, జనవరి 22(ఆంధ్ర జ్యోతి): గ్రామీణ ప్రజల సమస్యలను తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా గ్రటాళ్లమిట్ట పంచాయతీలో సీసీ రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని చెప్పారు. దీనిని గమనించిన చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సహకారంతో మాట ఇచ్చిన రెండు నెలల్లోనే సీసీ రోడ్డు పూర్తిచేయడం హర్షనీయమని ఆయన పేర్కొన్నారు.

గోకులం షెడ్డు ప్రారంభం



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న పాలకూరు సర్పంచ్ పంకజాక్షి

పూతలపట్టు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలకూరు పంచాయతీ కిచ్చెన్నగారిపల్లెలో మునిరత్నం నాయుడు అనే రైతు నిర్మించిన గోకులం షెడ్డును స్థానిక సర్పంచు పంకజాక్షి బుధవారం ప్రారంభించారు. నాయకులు రాజశేఖర్ నాయుడు, ఈశ్వర్, బాబు పాల్గొన్నారు.

రంగునీటి రసాయనాల నుంచి విముక్తి కలిగేనా..?

● చింతలపట్టెడ వాసుల ఆవేదన



చింతలపట్టెడలో రోడ్డుపైన ప్రవహిస్తున్న రసాయన రంగునీరు

నగరి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని చింతలపట్టెడలో రంగునీటి రసాయనాల నుంచి తమకు విముక్తి కలిగేనా? అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డైయింగ్ యూనిట్లు డేంజర్‌బెల్స్ మోగిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రమాదకరమైన రసాయన వ్యర్థ జలాలు మురుగునీటి కాలువలు, నీటిపారుదల కాలువలు, చెరువులు, ఖాళీస్థలాల్లో ప్రవహిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో 18 మిషన్ డైయింగ్ యూనిట్లు, సుమారు 90 మ్యాన్యువల్ డైయింగ్ యూనిట్లు ఉన్నాయి. నిబంధనల మేరకు మిషన్ డైయింగ్ యూనిట్ దారులు స్వంతంగా ఈటీపీ ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. మ్యాన్యువల్ డైయింగ్ యూనిట్లకు కామన్ ఈటీపీ ఉంది. పట్టణ పరిధిలో 18 డైయింగ్ యూనిట్లుండగా.. అందులో కేవలం రెండు యూనిట్లకే అనుమతి ఉందని.. అవి కూడా నిబంధనలు పాటించడం లేదని గత నెలలో జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారులు తెలిపారు.రంగునీటిలో జింక్, ఆర్సెనిక్ లాంటి రసాయనాలు కలిసి ఉండటంతో దీర్ఘకాలిక వ్యాధులు ప్రబలే ప్రమాదముందని అధికారులు చెప్పారు. నెల రోజుల్లో డైయింగ్ యూనిట్లను మూకుమ్మడిగా ఆపే విధంగా నిర్ణయం తీసుకోనున్నట్లు కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. మున్సిపల్ అధికారులు డైయింగ్ యూనిట్లపై చర్యలు తీసుకుంటామని ఓవైపు చెబుతుండగా మరోవైపు చింతలపట్టెడలో మిషన్ డైయింగ్ యూనిట్ల నుంచి పొగలు కక్కుతూ రంగునీరు రోడ్లపైకి, కాలువల్లోనూ ప్రవహిస్తుండటంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నగరి చెరువును ఆనుకుని వున్న ఈటీపీ పంప్‌హౌస్ సమీపాన, కొత్తపేట, ఏకాంబరకుప్పం, సత్రవాడలలో గల డైయింగ్ యూనిట్ల పరిసర ప్రాంతాలలోనూ రంగునీరు కాలువల్లోకి ప్రవహిస్తోంది. మున్సిపల్ పరిధిలోని మ్యాన్యువల్ డైయింగ్ యూనిట్లను సంక్రాంతి నుంచి ఆపేశారు. మిషన్ డైయింగ్ యూనిట్లకు సొంత ఈటీపీలున్నా రంగునీరు వీధుల్లో, కాలువల్లో పారుతున్నాయంటే ఈటీపీలను వాడటం లేదని తెలుస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలను కాపాడే విధంగా రంగునీటి ప్రవాహాన్ని అరికట్టాల్సి ఉంది.





ఏకాంబరకుప్పం రైల్వేగేటు వద్ద ఈటీపీ ప్లాంట్ చుట్టూ రంగునీరు - వినియోగించని ఈటీపీ ప్లాంట్

చిన్న కనుమ మలుపు... ప్రమాదాలకు పిలుపు



కార్వేటినగరం చిన్న కనుమ మలుపు

వెదురుకుప్పం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం చిన్న కనుమ మలుపు ప్రమాదాలకు పిలుపుగా మారింది. అయినప్పటికీ అక్కడ ప్రమాదాలు జరగకుండా అధికారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పదేళ్ల క్రితం ఓ పెళ్లి బృందం లారీ బోల్తా పడి 12 మంది మృతి చెందగా.. మరో 40 మంది వరకు గాయపడ్డారు. పలుసార్లు ఇక్కడ ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయారు. గాయపడి దివ్యాంగులయ్యారు. ఇక్కడ ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదని, ప్రమాదాలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. కార్వేటినగరం పెద్ద కనుమ, చిన్న కనుమ వద్ద ప్రమాదభరితంగా ఉందని వాహనచోదకులు తెలిపారు. ఈ మార్గంలో కొత్తగా వచ్చే వారికి ప్రమాద మలుపులు ఉన్న విషయం తెలియదు. కార్వేటినగరం నుంచి పచ్చికాపల్లం వెళ్లే ఈ మార్గంలో ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రేపు విడుదల కానున్న శిఖండి సినిమా

● చిత్ర యూనిట్ మొత్తం చిత్తూరు వారే

చిత్తూరు సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన చిత్ర నిర్మాణ సంస్థ కె.కె. ఆర్ట్ ఫిల్మ్ సమర్పణలో నిర్మించిన శిఖండి సినిమా ఈనెల 24న విడుదల కానుందని చిత్ర నిర్మాత, దర్శకుడు కోడి కిషోర్ తెలిపారు. చిత్తూరు, ఐరాలకు చెందిన వర్ధమాన నటులే నటించిన ఈ చిత్రం చిత్తూరులోని వెంకటేశ్వర థియేటర్‌తో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 150కి పైగా థియేటర్లలో విడుదల కానుందని తెలిపారు.

పూతలపట్టులో పశువైద్య శిబిరం

పూతలపట్టు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు దళితవాడలో పశువైద్యాధికారులు బుధవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశుసంచార సహాయకురాలు డాక్టర్ గీతారెడ్డి మాట్లాడుతూ ఈనెల 31వ తేదీవరకు మండలంలోనే పశువైద్య శిబిరాలు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది అరుణ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం



మాంగాడులో గోకులం షెడ్డును ప్రారంభించి ఆవుకు అరటిపండ్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి మండల పరిధిలోని 12 పంచాయతీల్లో బుధవారం ఆయన పలు చోట్ల సిమెంటురోడ్లను, గోకులం షెడ్లను ప్రారంభించారు. ఎన్ఆర్‌జీఎస్ పథకం కింద 11 పంచాయతీల్లో రూ.85.20 లక్షల వ్యయంతో నిర్మించిన 2023 మీటర్ల సిమెంటు రోడ్డును, రూ.15లక్షల వ్యయంతో నిర్మించిన ఆరు గోకులం షెడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు బాగుచేయాలన్న సంకల్పంతో సిమెంటురోడ్లను నిర్మించినట్లు తెలిపారు. పశువులు, గొర్రెలు, మేకల పోషణకు అనువుగా గోకులం షెడ్లను ప్రతి పంచాయతీలోనూ మంజూరు చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవికుమార్, పంచాయతీరాజ్ డీఈ సుబ్బరాయుడు, ఏఈ వీరభద్రం, ఎంపీడీవో సతీష్, ఏపీవో కవిత, టీడీపీ మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, రాష్ట్ర టీఎన్ టీయూసీ కార్యదర్శి బాలాజీ, టీడీపీ మహిళా అధికారప్రతినిధి మీరా, కాపునాడు డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, నాయకులు సురేష్ నాయుడు, హరిబాబు, దయాలన్, నారాయణ స్వామి నాయుడు, గోపాల్‌శెట్టి, అలెక్స్, కన్నివేలురెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ బూత్‌కమిటీ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేష్



గంగాధరనెల్లూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా గంగాధరనెల్లూరు మండలం బాలగంగనపల్లె పంచాయతీ బట్టుజంగనపల్లె గ్రామానికి చెందిన ఎన్.వెంకటేష్‌ను నియమించినట్లు బుధవారం ఆయన తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవికి ఎంపిక చేసినందుకు మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, జిల్లా వైసీపీ అధ్యక్షుడు కరుణాకర రెడ్డి, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉనికికోసమే కూటమిపై వైసీపీ నేతల అసత్యప్రచారం

● టీడీపీ యాదవ సాధికార సమితి

గంగాధరనెల్లూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాజీ సీఎం జగన్‌రెడ్డితో పాటు వైసీపీకి చెందిన నేతలు ఉనికికోసమే కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ అన్నారు. గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లెలో బుధవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో శ్రీధర్‌యాదవ్, సర్పంచు గంగయ్యలు కలిసి దూడలకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. మండలంలో నెల్లేపల్లె, కొండేపల్లె, మహదేవమంగళం గ్రామాల్లో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాలకు మొత్తం 2107 పాడి ఆవులు, గొర్రెలు, మేకలు, పాడి దూడలు వచ్చాయని, వాటిలో 1280 గొర్రెలు, మేకలకు డీవార్మింగ్, 121 పాడి ఆవులకు చూలు పరీక్షలు, 71 పాడి ఆవులకు గర్భకోశవ్యాధి నివారణ పరీక్షలు, 95 దూడలకు నట్టల నివారణ మందు వేసినట్లు వెటర్నరీ డాక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధరనెల్లూరు వెటర్నరీ ఏడీ డాక్టర్ మురళీ మోహన్, ఎట్టేరి, తూగుండ్రం వెటర్నరీ డాక్టర్లు నాగాంజనేయులు, శ్రీనాథ్, వంశీకృష్ణ, కొండేపల్లె సర్పంచు గోవిందయ్య, వెటర్నరీ సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై డీపీవో ఆగ్రహం



సచివాలయ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీపీవో

వెదురుకుప్పం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె గ్రామ సచివాలయ ఉద్యోగుల పనితీరుపై జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) సుధాకరరావు మండిపడ్డారు. బుధవారం బొమ్మయ్యపల్లె గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డుపక్కన చెత్తచెదారం వేయడంపై హెచ్చరించారు. దేవళంపేటలో పంచాయతీ షాపింగ్ కాంప్లెక్సును సందర్శించారు. కోర్టు ఆంక్షలు ఉన్నప్పటికీ అక్కడ దుకాణాల ముందు అంగళ్ల నిర్వహణపై హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దుకాణాలను తొలగించాలని ఆదేశించారు.

పారిశుధ్య పనులపై శ్రద్ధ వహించండి

శ్రీరంగరాజపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులపై సచివాలయ సిబ్బంది శ్రద్ధ వహించాలని డీపీవో సుధాకరరావు ఆదేశించారు. బుధవారం 49.కొత్తపల్లెమిట్ట, మెదవాడ పంచాయతీల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీ కార్యదర్శి స్వర్ణ పంచాయతీ రిజిస్టర్ తయారు చేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఎస్‌డబ్ల్యూపీసీ సెంటరు ద్వారా తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి గ్రామ పంచాయతీకి ఆదాయం చేకూర్చే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహనమురళి, విస్తరణ అధికారి కోదండరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న డీఈలు

చిత్తూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమంలో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఆ శాఖ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. 3 అర్జీలు రాగా.. అందులో ఒకదానిని అప్పటికప్పుడే పరిష్కరించామని, మిగిలిన రెండు రూరల్ డివిజన్‌కు చెందినవి కావడంతో వారికి బదిలీ చేశామని ఆయన తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు



చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఎంఈవో తదితరులు

నగరి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నగరి మండల వనరుల కేంద్రంలో నగరి, నిండ్ర, విజయపురం, పుత్తూరు, వడమాలపేటకు చెందిన విద్యార్థులకు బుధవారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతి ఏడాది జాతీయ ఓటర్ల దినోత్సవంపై ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీదేవి తెలిపారు. అందులో భాగంగా బుధవారం నిర్వహించిన పోటీల్లో పుత్తూరుకు చెందిన అభిరామి చిత్రలేఖనంలో, విజయపురం మండలానికి చెందిన నందా వ్యాసరచనలో ప్రథమస్థానం సాధించినట్లు ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పైన, ప్రజాస్వామ్య వ్యవస్థ పైన అవగాహన పెంచుకోవాలన్నారు.